# ప్లాట్లు అమ్మబడును

భార్య సలహా మేరకు వ్యాపారం చేయాలనుకున్నాడు విశ్వనాథం. వ్యాపారానికి కావాల్సిన హంగులన్నీ ఏర్పాటు చేసుకున్నాడు. ఇంట్లో ముందు గది ఆఫీస్ రూమ్‌గా మార్చుకుని అందులో ఒక సీలింగ్ ఫేను, టేబుల్, నాలుగు కుర్చీలు వేయించాడు.

"ప్లాట్లు అమ్మబడును. సంప్రదించు వేళలు ఉదయం 7 గం. నుండి 10 గంటలవరకూ, సాయంత్రం 6 గం. నుండి 9 గం. వరకూ" అనే బోర్డు రాయించి ఇంటిముందు గేటుకు వ్రేలాడదీయించాడు.

ఓ రోజు సాయంత్రం 6 గంటలకు జీపులో ముగ్గురు వ్యక్తులు వచ్చారు. వారిని చూసి విశ్వనాథం మంచి బేరం వచ్చిందని ఆనందించి వారిని సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టాడు.

"మీ వద్ద అమ్మకానికి ఎన్ని ప్లాట్సు వున్నాయి?" వచ్చినవారిలో ఒకరు అడిగారు.

"సుమారు వందవరకూ వున్నాయి" అన్నాడు విశ్వనాథం గర్వంగా.

"అవన్నీ మీ స్వంతమేనా? లేక"

"నూటికి నూరుపాళ్లు నా సొంతమే"

"ఇప్పటివరకు ఎన్ని ప్లాట్లు అమ్మారు?"

"బోణీ కాలేదంటే బాగుండదనుకుని పాతికవరకూ అమ్ముడుపోయాయి" అన్నాడు దర్జాగా.

"అన్నీ ఒక్కరే కొన్నారా లేక?"

"లేదు. వేరు వేరు వ్యక్తులు"

"చూడు మిస్టర్. మీరు ఇంత ప్రాపర్టీ ఉంచుకుని దానిని డిక్లేర్ చెయ్యకపోవడం నేరం. మేము ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చాం. మొత్తం మీ ప్రాపర్టీ వేల్యూ డిక్లేర్

చేసి టాక్స్ కట్టండి.

అంతేకాదు ప్లాట్స్ కొన్నవారి వివరాలు సబ్‌మిట్ చేయండి"

"ప్లాట్లు అంటే ఇళ్లస్థలాలు కాదండీ బాబూ. కథలకు ప్లాట్లు. నాకు అంగుళం భూమి కూడా లేదండీ. మా ఇల్లు కూడా అద్దెకొంప. నేను సెంకండరీ స్కూలు మాస్టార్ని" అంటూ తన బాధ వెళ్లగక్కాడు విశ్వనాథం.

(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 12-6-1997)✪